

ఆటో ఢీకొని మహిళ మృతి

హన్వాడ, ఫిబ్రవరి 3: ఆటో ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. మహబూబ్‌నగర్ మండలంలోని మాచన్‌పల్లి గ్రామానికి చెందిన మంగమ్మ(32) తల్లిగారి గ్రామం కొన గట్టుపల్లి గ్రామానికి ఆటోలో వెళ్లింది. హన్వాడ వైన్స్ సమీపంలో దిగింది. రోడ్డు దాటుతుండగా, ఎదురుగా వేపూర్ నుంచి హన్వాడకు వెళ్తున్న ఆటో ఆమెను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్సై సాయిబాబా తెలిపారు.

క్యాన్సర్‌పై.. అవగాహన ఏదీ?



మహబూబ్‌నగర్‌లోని జిల్లా ఆస్పత్రి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ సెంటర్‌లో సేవలందిస్తున్న నర్సింగ్ సిబ్బంది(ఫైల్)

- ఉమ్మడి జిల్లాలో 140 మందికి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్
- 13,729 మందికి స్ర్కీనింగ్, మరో 575 మందికి లక్షణాలు
- వ్యాధి గుర్తింపు పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ
- అవగాహన లోపంతో ముందుకు రాని బాధితులు
- నిరుపయోగంగా మారిన రూ.లక్షల విలువైన కోల్పోస్కోపీ యంత్రాలు
- నేడు ప్రపంచ క్యాన్సర్ దినం



మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) ఫిబ్రవరి 3: క్యాన్సర్ వ్యాధి ప్రాణాంతకమైంది. ఊపిరితిత్తులు, నోరు, రొమ్ము, గొంతు క్యాన్సర్‌తో పాటు గర్భాశయ క్యాన్సర్ కూడా అందులో ఒకటి. మహిళల్లో సోకే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై అవగాహన కరువైంది. తాజాగా ఈ వ్యాధితో ఓ బాలివుడ్ నటి చనిపోయిందని వార్త తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తర్వాత ఆమె గర్భాశయ క్యాన్సర్‌పై మహిళల్లో అవగాహన కల్పించేందుకే తాను చనిపోయానని చెప్పినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో స్పందించిన కేంద్ర ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి సెప్టెంబరు నుంచి వ్యాధి నివారణ టీకాలు వేయాలని నిర్ణయించింది. ఈ క్యాన్సర్‌పై ఉమ్మడి జిల్లాలో అవగాహన లేకుండా పోయింది. వైద్య ఆరోగ్య శాఖ దాన్ని పూర్తిగా గాలికి వదిలేసింది. ఫలితంగా చాపకింద నీరులా వ్యాధి విజృంభిస్తోంది. నేడు ప్రపంచ క్యాన్సర్ దినంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

గాలికొదిలేసిన వైద్య ఆరోగ్య శాఖ

సర్వైకల్ క్యాన్సర్‌ను ఉమ్మడి జిల్లాలోని వైద్య, ఆరోగ్య శాఖలు గాలికొదిలేశాయి. ఈ క్యాన్సర్‌ను గుర్తించేందుకు, మహిళలకు అవగాహన కల్పించేందుకు, స్ర్కీనింగ్ కోసం జిల్లా కేంద్రాలలోని ఐఆర్‌హెచ్‌ఎస్ సెంటర్లకు పంపించేందుకు ప్రతీ పీహెచ్‌సీలో ఒక స్టాఫ్ నర్సు ఉన్నారు. కానీ ఒక్కరూ పనిచేయడం లేదు. ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఈ వ్యాధి లక్షణాలు ఉన్నా లేకున్నా 25 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలలోపు మహిళలకు స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకునేందుకు కౌన్సెలింగ్ ఇప్పించాలి. కానీ అవి కూడా జరగడం లేదు. ఇందుకోసం ప్రభుత్వం ఎన్‌సీడీ అని ఒక విభాగాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఒక ప్రోగ్రాం ఆఫీసర్‌ను కూడా నియమించింది. ఆ విభాగం కేవలం బీపీ, షుగర్ పరీక్షలు చేయడానికే సరిపోతోంది. దీనిపై పర్యవేక్షణ చేయాల్సిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

140 మంది బాధితులు..

ప్రాణాంతకమైన గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బాధితులు ఉమ్మడి జిల్లాలో 140 మంది ఉన్నారు. గత ఏడాది 2023లో జనవరి నుంచి ఇప్పటి వరకు 13,729 మందికి స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించగా, అందులో 140 మందికి క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా మరో 575 మందికి కూడా క్యాన్సర్ లక్షణాలు ఉండటంతో బయాప్సి తీసి పరీక్షలకు పంపించారు. వారికి చికిత్స కూడా అందిస్తున్నారు. అందులో 20 మంది వరకు చికిత్స తీసుకోవడం లేదు. అనధికారిక లెక్కల ప్రకారం వేల మంది గర్భాశయ క్యాన్సర్ బాధితులు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

మహిళల్లోనే అధికం

క్యాన్సర్ బాధితుల్లో ఎక్కువ శాతం మహిళలే ఉన్నారు. చాలా కొద్ది మందికి మాత్రమే రొమ్ము క్యాన్సర్ వస్తోంది. పట్టణ ప్రాంతాల్లోని వారికే ఈ వ్యాధి సోకుతోంది. కానీ గ్రామీణ ప్రాంతాల్లో ఉండే మహిళలకు ఎక్కువగా గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ సోకుతోంది. చిన్నవయసులో పెళ్లిళ్లు చేయడం, పరిశుభ్రత పాటించకపోవడం, సంభోగంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో వ్యాధి బారిన పడుతున్నారు. పురుషుల్లో అధికంగా నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ బాధితులు ఉన్నారు.

ఐఆర్‌హెచ్‌ఎస్ ద్వారానే సేవలు

మహిళల్లో వచ్చే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్మూలన కోసం ఇన్‌స్టిట్యూట్ ఫర్ రూరల్ హెల్త్ స్టడీస్(ఐఆర్‌హెచ్‌ఎస్), ఎంఎన్‌జే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ కొలాబరేటివ్ ప్రాజెక్టు ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు. దీనికి సంబంధించి మహబూబ్‌నగర్‌లోని జనరల్ ఆస్పత్రిలో 2003లో, నాగర్‌కర్నూల్‌లో 2017లో, వనపర్తిలో 2018లో, గద్వాల్‌లో 2022లో సెంటర్లను ఏర్పాటు చేసి క్యాన్సర్ పరీక్షలు చేసి చికిత్స అందిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత వారిని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రికి పంపించి చికిత్స అందిస్తున్నారు. బాధితులకు రవాణా ఖర్చులతో పాటు ఉచిత భోజన వసతి కల్పిస్తున్నారు. జనరల్ ఆస్పత్రికి వచ్చే మహిళలకు సెంటర్ నర్సింగ్ సిబ్బంది కౌన్సెలింగ్ ఇచ్చి పరీక్ష చేయిస్తున్నారు.

అవగాహన లోపంతో పెరుగుతున్న కేసులు

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన లేకపోవడంతో ఏటా క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే మహిళలే దీని బారిన పడుతున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, చిన్నవయసులో పెళ్లిళ్లు చేయడం, చిన్నవయసులో పిల్లల్ని కనడం వంటి కారణాల వలన ఈ వ్యాధి బారిన పడుతున్నారు. దీన్ని ముందుగానే గుర్తిస్తే నయం చేసేందుకు అవకాశాలు చాలానే ఉన్నాయి. ప్రస్తుతం అన్ని జిల్లాల్లో ఐఆర్‌హెచ్‌ఎస్ సెంటర్లు ఉన్నాయి. అందులో ఉచితంగా థర్మోకోగిలైజేషన్, క్రయోథెరఫీ, పాప్స్మియర్ పరీక్షలు చేసి వ్యాధిని నిర్ధారిస్తున్నారు. హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పని లేకుండా అక్కడే చికిత్సలు కూడా అందిస్తున్నారు. 25 నుంచి 60 ఏళ్లలోపు మహిళలు స్వచ్ఛందంగా వచ్చి పరీక్షలు చేయించుకుంటే గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌ను నివారించేందుకు అవకాశం ఉంది.

మూలనపడ్డ యంత్రాలు



మహబూబ్‌నగర్‌లోని జిల్లా ఆస్పత్రిలో మూలకు పడ్డ కోల్పోస్కోపీ యంత్రం

ఎన్‌సీడీ ప్రోగ్రాం కింద రాష్ట్ర ప్రభుత్వం 2021 అక్టోబరులో ప్రతీ జిల్లాకు రూ.11 లక్షల విలువైన కోల్పోస్కోపీ యంత్రాలను పంపిణీ చేసింది. ప్రింటర్లను కూడా ఇచ్చింది. వాటిని వినియోగించకుండా మూలన పడేశారు. ప్రతీ జిల్లాలో నలుగురు స్టాఫ్ నర్సులకు ఒక్కొక్కరికి రూ.1.20 లక్షలు ఖర్చు చేసి ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో, ముంబైలోని మరో క్యాన్సర్ ఆస్పత్రిలో రెండు నెలల పాటు శిక్షణ కూడా ఇచ్చారు. కానీ వారిని ఎన్‌సీడీ క్లీనిక్‌లలో ఉంచి బీపీ, షుగర్ పరీక్షలు చేయడానికి వినియోగించుకుంటున్నారు.

మంత్రి హామీ నెరవేరేనా?



తమకు న్యాయం చేయాలని మంత్రి దామోదర రాజనరసింహకు విన్నవిస్తున్న ఇళ్ల పట్టా లబ్ధిదారులు(ఫైల్)

- ఇటీవల గద్వాలకు వచ్చిన దామోదర రాజనరసింహతో ఇళ్ల పట్టాదారుల ఆవేదన
- తమ పట్టాలు లాక్కొని ఆస్పత్రి, నర్సింగ్ కళాశాల నిర్మిస్తున్నారని ఆరోపణ
- న్యాయం చేయాలని విన్నపం..
- సానుకూలంగా స్పందించిన దామోదర

గద్వాల, ఫిబ్రవరి 3: కాంగ్రెస్ ప్రభుత్వం 2012లో తమకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను లాక్కుని ఆస్పత్రి, నర్సింగ్ కళాశాలలు నిర్మిస్తున్నారని, తమకు న్యాయం చేయాలని ఇటీవల గద్వాలకు వచ్చిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను బాధితులు కలిసి విన్నవించారు. న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇవ్వడంతో ఇళ్ల పట్టాదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి రాష్ట్ర మంత్రి డీకే అరుణ దౌదర్‌పల్లి దర్గా సమీపంలో గల సర్వే నంబర్లు 968, 969, 979, 980, 983, 984, 985లలోని 39 ఎకరాలు, దానికి పక్కనే ఉన్న పరమాల గ్రామ శివారులోని 41 ఎకరల భూమిని ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇళ్ల పట్టాల పంపిణీ కోసం భూ సేకరణ చేశారు. గద్వాల శివారులోని 39 ఎకరాలలో పట్టణంలో ఇండ్లు లేని నిరుపేదలకు ఇళ్ల పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. 2012లో దాదాపు 1,400 మందిని గుర్తించి, అప్పటి రెవెన్యూ అధికారుల సమక్షంలో పట్టాలు పంపిణీ చేశారు. ఇంకా 41 ఎకరాల మిగులు భూమి ఉంది. ఆ తర్వాత 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం, బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన విషయం తెలిసిందే. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఇళ్ల పట్టాల పంపిణీకి బదులుగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకాన్ని ప్రారంభించింది. గద్వాలకు 1,300 ఇండ్లు మంజూరు అయ్యాయి. ఆ ఇళ్ల నిర్మాణాన్ని అక్కడున్న మిగులు భూమి 15 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టారు.

ఆస్పత్రి నర్సింగ్ కళాశాల మంజూరుతో..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గద్వాలకు 300 పడకల ఆస్పత్రి, నర్సింగ్ కళశాల మంజూరైంది. దీంతో దానిని ఎక్కడ నిర్మించాలనే దానిపై పలు భూములను అధికారులు పరిశీలించారు. దౌదర్‌పల్లి దర్గా వద్ద పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల పట్టాల భూమిని గుర్తించి ఫైనల్ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఫైల్ కనిపించడం లేదనే కారణంతో ఇళ్ల పట్టాలను రద్దుచేసి, 300 పడకల ఆస్పత్రికి 14 ఎకరాలు, నర్సింగ్ కళశాలకు ఐదు ఎకరాలు, మెడికల్ కళాశాలకు 20 ఎకరాల భూమి కేటాయించారు. ఆస్పత్రి భవన నిర్మాణానికి మంత్రి హరీశ్‌రావుతో భూమిపూజ చేయించారు. దీంతో డీకే అరుణతో పాటు అన్ని ప్రతిపక్ష పార్టీలు, ఇళ్ల పట్టాదారులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. నిరసనలు, దీక్షలు చేసినా ప్రభుత్వంతో పాటు పాలకులు మొండిగా అక్కడే ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేశారు. దీంతో దాదాపు 614 మంది ఇళ్ల పట్టాదారులు కోర్టుకు వెళ్లారు. వారికి న్యాయం చేయాలని కోర్టు అధికారులను ఆదేశించింది.

మంత్రి హామీతో చిగురిస్తున్న ఆశలు

గద్వాలలో నిర్మిస్తున్న 300 పడకల ఆస్పత్రిని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఇటీవల పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్ల పట్టాదారులు మంత్రిని కలిసి, తమ గోడును వినింపచారు. తమ ఇళ్ల పట్టాలను లాక్కుని, ఆస్పత్రిని నిర్మించారని, తమకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన మంత్రి పట్టాలు కోల్పోయిన లబ్ధిదారులందరికి న్యాయం చేస్తామని, ధైర్యంగా ఉండాలని హామీ ఇచ్చారు. దాంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అయితే వారికి ఇళ్ల ఎక్కడ పట్టాలు ఇస్తారు? అనేది సందిగ్ధంగా మారింది. దౌదర్‌పల్లి దర్గా దగ్గర మిగులు భూమి కొద్దిగానే ఉంది. 1,400 మందికి పట్టాలివ్వాలంటే అనంతాపురం(పూడూరు శివారులో) దగ్గర.. లేదంటే కొండపల్లి రోడ్డులో మాత్రమే ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఇప్పటికే సర్వే నంబర్ 368లోని భూమి వివరాలను తహసీల్దార్ సేకరించారు. కొండపల్లి రోడ్డులోని భూమి వివరాలు అందుబాటులో ఉన్నాయి. ఆ భూములను ఇస్తారా? లేదా? అనేది వేచి చూడాలి.



పేదలకు పట్టాలిచ్చిన స్థలంలో నిర్మిస్తున్న 300 పడకల ఆస్పత్రి

మళ్లీ తెరపైకి అవిశ్వాసం

- వనపర్తి పురపాలికలో బీఆర్ఎస్ కౌన్సిలర్ల తిరుగుబాటు
- చైర్మన్, వైస్ చైర్మన్ మినహా 18 మంది కౌన్సిలర్ల రహస్య మీటింగ్
- అవిశ్వాసం పెడుతున్నట్లు సంతకాలు చేసి మాజీ మంత్రికి లేఖ
- నేడు సమాధానం రాకపోతే.. సోమవారం జిల్లా కలెక్టర్‌కు నోటీసు ఇస్తామని వెల్లడి



వనపర్తి మునిసిపల్ కార్యాలయం

వనపర్తి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వనపర్తి మునిసిపాలిటీలో అవిశ్వాసం మళ్లీ తెరపైకి వచ్చింది. గత నెల 4న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి అసమ్మతి కౌన్సిలర్లతో సమావేశమై రాజీ కుదుర్చగా.. కొన్నాళ్లు స్తబ్దుగా ఉన్న కౌన్సిలర్లు మళ్లీ తమ అసమ్మతి వాదాన్ని వినిపిస్తున్నారు. ప్రధానంగా చైర్మన్, వైస్ చైర్మన్ దిగిపోవాలని.. తమలో ఇద్దరిని కొత్తగా చైర్మన్, వైస్ చైర్మన్ చేసుకుంటామని ఘంటాపథంగా చెబుతున్నారు. మునిసిపాలిటీలో బీఆర్ఎస్ సభ్యులు ప్రస్తుతం 23 మంది ఉన్నారు. మొత్తం సభ్యుల సంఖ్య 33 కాగా.. అందులో బీఆర్ఎస్ నుంచి 25 మంది, కాంగ్రెస్ నుంచి ఐదుగురు, బీజేపీ నుంచి ఇద్దరు, టీడీపీ నుంచి ఒకరు విజయం సాధించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు సత్యంసాగర్, విభూది నారాయణ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. దీంతో బీఆర్ఎస్ బలం 23కు పడిపోయింది. కొన్నాళ్లుగా చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌పై అసంతృప్తితో ఉన్న కౌన్సిలర్లు.. సంక్రాంతికి ముందే అవిశ్వాసంవైపు అడుగులు వేశారు. ఒకసారి మాజీ మంత్రి ఇంటి వద్ద, మరోసారి హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి, మాజీ ఎంపీ ఇద్దరూ కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. గతంలో ఒకటి రెండు సార్లు ఇలాగే కౌన్సిలర్లు సమావేశమైనా.. అప్పట్లో అవిశ్వాస తీర్మానానికి సమయం కాకపోవడంతో స్తబ్దుగా ఉండిపోయారు. పాత పాలకవర్గానికి అప్పట్లో నిరంజన్‌రెడ్డి మద్దతు ఉండటంతో ఆయన చెప్పినట్లు నడుచుకున్నారు. డిసెంబరులో వనపర్తి అసెంబ్లీ నుంచి కాంగ్రెస్ విజయం సాధించడం.. అవిశ్వాసానికి సమయం కూడా దగ్గరపడటంతో కౌన్సిలర్లంతా సిద్ధమయ్యారు. కానీ అందులో ఎవరు చైర్మన్ కావాలి? ఎవరు కావొద్దు అనే విషయాల్లో సామాజిక వర్గాల కూర్పుతో సమస్య ఏర్పడింది. తెలంగాణ భవనలో జరిగిన సమావేశంలో మాజీ మంత్రి ఏం చెబితే అదే చేస్తామన్నట్లు చెప్పి వచ్చారు. తర్వాత అంతా సైలెంట్ అయిపోగా.. శనివారం మళ్లీ చైర్మన్, వైస్ చైర్మన్ మినహా బీఆర్ఎస్ కౌన్సిలర్లంతా సమావేశం కావడం చర్చనీయాంశంగా మారింది.

కాంగ్రెస్ మద్దతు లేకుండానే..

మునిసిపాలిటీలో అవిశ్వాసం నెగ్గాలంటే కచ్చితంగా 2/3 మెజారిటీ అవసరం. ప్రస్తుతం బీఆర్ఎస్‌కు చెందిన 18 మంది సభ్యులు సంతకాలు చేయగా.. మరో నలుగురు కలిస్తే అవిశ్వాసం నెగ్గుతుంది. కానీ చైర్మన్, వైస్ చైర్మన్ మినహా ప్రస్తుతం బీఆర్ఎస్ సభ్యుల సంఖ్య 21 మాత్రమే. సంతకాలు చేసిన 18 మందితో మిగతా ముగ్గురు కలిసి వచ్చినా సంఖ్య 21 అవుతుంది. మరో సభ్యుడి అవసరం ఉంటుంది. ఒకవేళ అదే పార్టీలో చైర్మన్, వైస్ చైర్మన్ తమ పదవులకు రాజీనామా చేస్తే తప్ప.. కాంగ్రెస్ లేదా టీడీపీ మద్దతు లేకుండా అవిశ్వాసం నెగ్గడం జరగదు. ఈ నేపథ్యంలో కౌన్సిలర్లంతా కాంగ్రెస్ మద్దతు లేకుండానే అవిశ్వాసం పెట్టాలని భావిస్తుండటం గమనార్హం. గతంలో అవిశ్వాసం పెట్టడం కోసం కసరత్తు చేసినప్పుడు ప్రస్తుత అసంతృప్త కౌన్సిలర్లు కాంగ్రెస్ మద్దతు కోరారు. తమ సభ్యుల మద్దతు సరిపడా లేకపోతే తమకు సహకరించాలని తెలిపారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ మద్దతు అవసరం లేదని చెబుతున్నారు. ప్రస్తుతం మునిసిపాలిటీలో కాంగ్రెస్ సభ్యుల సంఖ్య తొమ్మిదికి చేరింది. ఒకరు టీడీపీ సభ్యుడిగా ఉన్నారు. ఎలాగోలా 2/3 పద్ధతి ప్రకారం 22 మంది మద్దతు దొరికి అవిశ్వాసం నెగ్గితే.. తర్వాత తమ పార్టీలో ఉన్న 18 మంది సభ్యుల బలమే కొత్త చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకోడానికి సరిపోతుందనే భావన అసంతృప్త కౌన్సిలర్లలో ఉంది. అయితే మాజీ మంత్రికి సంతకాల లేఖ పంపగా.. ఈ నెల ఏడో తేదీన నిర్ణయించుకుందామని చెప్పినట్లు సమాచారం.

18 మంది సంతకాలతో లేఖ..

కౌన్సిలర్లంతా శనివారం ఒక కౌన్సిలర్ ఇంట్లో సమావేశమయ్యారు. బీఆర్ఎస్ సభ్యులు 23 మంది కాగా.. సమావేశానికి 18 మంది హాజరయ్యారు. ఈ సమావేశంలో అందరూ అవిశ్వాసానికి మద్దతుగా ఒక లేఖ రాసి, సంతకాలు చేసి.. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి పంపినట్లు తెలిసింది. ఆదివారం మాజీ మంత్రి నిర్ణయం చెప్పకపోతే.. సోమవారం కలెక్టర్‌కు అవిశ్వాసం పెట్టడానికి నోటీసులు అందజేస్తామని అందులో పేర్కొన్నట్లు సమాచారం. తెలంగాణ భవనలో గత నెల 4న మాజీ మంత్రి ఆధ్వర్యంలో సమావేశం జరగ్గా.. అందులో అందరూ కలిసి పనిచేసుకోవాలని, తాను మరోసారి అందరితో సమావేశమై సమస్యలపై చర్చిస్తానని చెప్పినట్లుగా కొందరు కౌన్సిలర్లు తెలిపారు. గత నెల 23నే సమావేశం నిర్వహిస్తారని భావించినప్పటికీ.. ఇప్పటివరకు సమాధానం రాకపోవడం, మూడుసార్లు ఆ సమావేశం వాయిదా పడటంతో చేసేదేమి లేక ఈ నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. బీఆర్ఎస్‌లో మొత్తం 23 మంది సభ్యులు కాగా.. 18 మంది ప్రస్తుతం అవిశ్వాసం వైపు ఉన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్ మినహా మరో ముగ్గురు కూడా సైలెంట్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. వారి మద్దతు ఉంటుందని, మాజీ మంత్రి సహకారంతో చైర్మన్, వైస్ చైర్మన్‌ను మార్చుకుంటామని చెబుతున్నారు.

కృష్ణా జలాల కోసం ఎంతవరకైనా వెళ్తాం

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి
- జూరాల ప్రాజెక్టుపై నాయకులతో కలిసి బైఠాయింపు



జూరాల ప్రాజెక్టుపై గల మెయిన్ రోడ్డుపై బైఠాయించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

ధరూరు, ఫిబ్రవరి 3 : తెలంగాణ ప్రాంత రైతులను ఆదుకునేందుకు ఎంత దూరమైనా వెళతామని, కృష్ణా జలాలను కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు పరిధిలోకి ఇస్తే ఉమ్మడి పాలమూరు మళ్లీ ఎడారిగా మారుతుందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ఎన్నడూ కృష్ణా జలాలను బోర్డుకు ఇచ్చే ఆలోచనే చేయలేదన్నారు. ఈ నిర్ణయం వల్ల కృష్ణా పరీవాహక ప్రాంత రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. శనివారం జోగులాంబ గద్వాల జిల్లా ధరూరు మండల పరిధిలోని రేవులపల్లి గ్రామ సమీపంలో గల ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుపై ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి బైఠాయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో తెలంగాణ ప్రాజెక్టుల కింద ఉన్న అవుట్ లెట్స్‌ను ఈఎన్‌సీ బోర్డుకు అప్పగించారన్నది వాస్తవమా కాదా అనేది స్పష్టం చేయాలన్నారు. బోర్డు సమావేశంలో మినిట్స్‌ను పరిశీలిస్తే ఈఎన్‌సీ అప్పగింతకు అంగీకరించారన్నది అర్థమవుతుందన్నారు. దీంతో బోర్డు చైర్మన్ 15 ఔట్ లెట్స్ నిర్వహణకు సిబ్బందిని అడిగారని, ఔట్ లెట్స్ అప్పగించకపోతే బోర్డుకు ఎందుకు సిబ్బందిని అడిగారని ప్రశ్నించారు. ఏకపక్ష సమావేశంలో ప్రాజెక్టు కింద ఉన్న కాలువల (ఔట్ లెట్స్‌ను) నిర్వహణకు బోర్డుకు అప్పగిస్తామని స్పష్టంగా చెప్పారని ఎమ్మెల్యే ఆరోపించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా స్థానికుడైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అన్యాయం చేస్తున్నారనేది ప్రాజెక్టుల అప్పగింత ద్వారా తేటతెల్లమైందన్నారు. కృష్ణా జలాలను బోర్డుకు అప్పగిస్తే జోగులాంబ గద్వాల జిల్లాకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్, వైఎస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జంబు రామన్‌గౌడ పాల్గొన్నారు.



బాధితుడిని చికిత్స నిమిత్తం పోలీస్ వాహనంలో తరలిస్తున్న ఎస్ఐ వేణు

మానవత్వం చాటుకున్న ఎస్ఐ

పాన్‌గల్, ఫిబ్రవరి 3 : వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల కేంద్రం నుంచి శనివారం సాయంత్రం వెంగళాయిపల్లి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడు బైకు అదుపు తప్పి రోడ్డుపై స్పృహ తప్పి పడిపోయాడు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు స్థానిక ఎస్సై వేణుకు సమాచారం ఇచ్చారు. స్పందించిన ఎస్సై వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం తరలించేందుకు 108 కోసం ప్రయత్నించారు. వాహనం అందుబాటులో లేకపోవడంతో వెంటనే తన పోలీస్ వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. సకాలంలో స్పందించి తన వాహనంలో తరలించిన ఎస్సైని మండల వాసులు పలువురు అభినందించారు.

పట్టపగలు రూ.9 లక్షలు చోరీ


చోరీ అయిన నడిమింటి లాలప్ప ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

దామరగిద్ద, ఫిబ్రవరి 3 : నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం వత్తుగుండ్ల గ్రామంలో పట్టపగలు ఓ ఇంట్లో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన నడిమింటి లాలప్ప కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. శనివారం మధ్యాహ్నం ఇంటి నిర్మాణానికి గాను ఓ ప్రైవేటు బ్యాంకులో రూ.తొమ్మిది లక్షలు అప్పు తెచ్చాడు. తెచ్చిన అప్పును ఇంట్లోని ఓ గదిలో దాచి తాళం వేసి నారాయణపేటకు కుటుంబంతో సహా వెళ్లాడు. సాయంత్రం వచ్చి చూసేసరికి నగదు చోరీకి గురైంది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ రవిబాబు, ఎస్సై వసంత సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పూర్తి సమాచారం కోసం ఎస్సైని కోరగా ఫోన్ లిఫ్ట్ చేయడం లేదు.

తాటికొండలో బంగారం అపహరణ

భూత్పూర్ : గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చొరబడి నాలుగు తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. ఈ ఘటన శనివారం రాత్రి మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం తాటికొండలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బీరమ్మ అనే వృద్ధురాలు శుక్రవారం ఇంట్లో నిద్రించింది. శనివారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో ఆమె బాత్ రూముకు వెళ్లగా గుర్తు తెలియని దొంగలు ఇంట్లో చొరబడ్డారు. బీరువా తాళం విరగ్గొట్టి నాలుగు తులాల బంగారాన్ని దోచుకెళ్లారు. ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనా స్థలాన్ని వారు పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నడిగడ్డ ఫుట్‌బాల్‌కు మహర్దశ

- ఖేలో ఇండియా ద్వారా జిల్లాకు ఫుట్‌బాల్ కేంద్రం మంజూరు
- తనిఖీ కోసం ఢిల్లీ నుంచి రానున్న అధికారుల బృందం
- జాతీయ స్థాయి క్రీడాకారుడితో శిక్షణకు అవకాశం
- క్రీడాకారుల్లో చిగురిస్తున్న ఆశలు



గద్వాల తేరు మైదానంలో ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు(ఫైల్)

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 3 : సంస్థానాధీశుల కాలం నుంచి ఫుట్‌బాల్ క్రీడకు ఖ్యాతిగాంచిన నడిగడ్డకు మరోసారి మహర్దశ పట్టనుంది. గతంలో ఫుట్‌బాల్ క్రీడల్లో తమ ప్రతిభతో రాణించి జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులతో ఫుట్‌బాల్ అంటేనే గద్వాల అనేరీతిలో తన వైభవాన్ని చాటుకున్న నడిగడ్డ క్రీడావైభవం మరోసారి పునరావృతమయ్యే అవకాశం లభించనుంది. జాతీయ స్థాయి సామర్థ్యం ఉన్న క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడంతో పాటు, గ్రామీణ ప్రాంత యువ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా క్రీడలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం జోగుళాంబ గద్వాల జిల్లాకు వరంగా మారింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు మూడు ఖేలో ఇండియా కేంద్రాలు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకించి మహబూబ్‌నగర్, గద్వాల జిల్లాలకు ఫుట్‌బాల్ శిక్షణ కేంద్రాలను మంజూరు చేయడం విశేషం. భారత క్రీడా సంస్థ(సాయ్) ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే ఈ కేంద్రాల్లో శిక్షకుల నియామకం, క్రీడా శిక్షణ నిర్వహణ, కేంద్రాల ఏర్పాటు, జిల్లా, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థల పర్యవేక్షణలో కొనసాగనున్నాయి.



గద్వాల తేరు మైదానంలో శిక్షణ పొందుతున్న ఫుట్‌బాల్ క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

మెరుగైన శిక్షణ

జిల్లాకు మంజూరయ్యే ఖేలో ఇండియా కేంద్రంలో 30 మందికి తగ్గకుండా బాలబాలికలకు ఫుట్‌బాల్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం జిల్లా కేంద్రంలోని ఎంపిక చేసిన మైదానంలో ప్రత్యేక ఏర్పాటు చేసి బాలబాలికలు ఉన్నత ప్రమాణాలతో కూడిన శిక్షణ ఇస్తారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ప్రతియేటా రూ. ఐదు లక్షల వరకు నిధుల మంజూరుతో పాటు, అవసరమైన క్రీడా పరికరాలు, సామగ్రి అందజేసి కోచ్‌కు రూ.20వేలకు పైగా ప్రోత్సాహక వేతనం ఇవ్వనున్నారు. ఇప్పటికే జోగుళాంబ గద్వాల జిల్లాలో జాతీయ స్థాయిలో ప్రతిభను చాటడంతో పాటు క్రీడా కోటలో వివిధ శాఖలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా సేవలందిస్తున్న సీనియర్ క్రీడాకారుల సలహాలు, సూచనలు, సహకారం తీసుకోగలిగితే గద్వాలకు మంజూరైన ఖేలో ఇండియా కేంద్రం మోడల్ శిక్షణ కేంద్రంగా గుర్తింపు పొందే అవకాశం ఉంది. ఖేలో ఇండియా కేంద్రం నిర్వహణ బాధ్యతలు స్వీకరించనున్న జాతీయ స్థాయి క్రీడాకారుడు ఝూడే శ్రీనివాస్ నిర్ణయం తీసుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు.

ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి..



ఫుట్‌బాల్ శిక్షణ కోసం జిల్లాకు మంజూరైన ఖేలో ఇండియా కేంద్రాన్ని నిర్వహించే బాధ్యతలు దక్కడం అదృష్టంగా భావిస్తున్నారు. సీనియర్ క్రీడాకారులు, అసోసియేషన్ బాధ్యులు, ప్రవీణ్ సేవా సమితి ప్రతినిధులు, డీవైఎస్‌వో సహకారంతో బాలబాలికలకు మెరుగైన శిక్షణ ఇచ్చి ఫుట్‌బాల్ క్రీడల్లో జాతీయ స్థాయిలో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు నిబద్ధతతో కృషిచేస్తా. గద్వాలకు ఫుట్‌బాల్ శిక్షణ కోసం అందించిన అవకాశాన్ని అద్భుత రీతిలో అందిపుచ్చుకునేందుకు అందరి సహకారాన్ని తీసుకుంటా.

- ఝూడే శ్రీనివాస్,
జాతీయ స్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారుడు

క్రీడాకారులకు అద్భుత అవకాశం..



క్రీడల పట్ల ఆసక్తి ఉండి తగిన శిక్షణ కోసం ఎదురుచూస్తున్న యువ క్రీడాకారులు, బాల బాలికలకు ఖేలో ఇండియా కేంద్రం రావడం అద్భుత అవకాశం. ఈ కేంద్రం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా శిక్షణనిచ్చే కోచ్‌లు, తగిన క్రీడా పరికరాలు అందుబాటులోకి రావడం వరమే. ఈ అవకాశాన్ని జిల్లాకు చెందిన ఔత్సాహిక క్రీడాకారులు అందిపుచ్చుకోవాలి. ప్రభుత్వపరంగా మా నుంచి పూర్తి సహకారం, తోడ్పాటునందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

- డాక్టర్ బీఎస్.ఆనంద్,
డీవైఎస్‌వో, జోగుళాంబ గద్వాల జిల్లా

వైభవంగా అభయాంజనేయస్వామి శకటోత్సవం

- ప్రారంభమైన స్వామివారి బ్రహ్మోత్సవాలు

ఊర్కొండ, ఫిబ్రవరి 3 : ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా శకటోత్సవంతో ప్రారంభమయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండపేట అభయాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఉత్సవాలకు సుదూర ప్రాంతాలతో పాటు, పరిసర గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించుకొని వారి మొక్కులను చెల్లించుకుంటారు. శనివారం ఉదయం ఊర్కొండపేట బ్రహ్మశ్రీ కీ.శే. చిలివెల్లి కృష్ణమూర్తి అర్చకుల గృహం నుంచి ఉత్సవమూర్తిని పల్లకీలో ఊరేగింపుగా మంగళ వాయిద్యాల నడుమ భక్తుల సందడితో ఆలయ ప్రవేశం చేయించారు. బ్రహ్మోత్సవాల కార్యక్రమాలకు కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి, పాలక మండలి సభ్యులు మనోహర్‌రెడ్డి, నర్సిరెడ్డి, రమేష్‌నాయక్, గోపాల్, చంద్రయ్య, మల్లేష్‌యాదవ్, అశోక్, సంగప్పగౌడ్, వెంకటయ్య, అంజయ్యగౌడ్, సువర్ణ, లక్ష్మమ్మ, అలివేలతో పాటు అర్చకులు దత్తాత్రేయశర్మ ధ్వజారోహణంతో మూలస్వామికి పంచామృతాభిషేకం, నూతన వస్త్రధారణ, వెండి



ధ్వజారోహణంలో పాల్గొని పూజలు నిర్వహిస్తున్న కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి, పాలక మండలి సభ్యులు



అభయుడి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ఎడ్లబండ్లు

ఆభరణాల అలంకారంతో సహస్ర నామార్చన జరిపించారు. అభయాంజనేయుడికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం శకటోత్సవం ప్రారంభించారు. ఊర్కొండపేట, ఊర్కొండ, ముచ్చర్లపల్లి, రాంరెడ్డిపల్లి, జకినాలపల్లి, ఇప్పపహడ్, జిల్లెల్ల, మార్చాల తదితర గ్రామాల నుంచి ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు, కార్లు భారీగా చేరుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ పరిసరాలు ఆంజనేయ నామస్మరణతో మారుమోగాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కల్వకుర్తి డీఎస్పీ పార్థసారథి ఆధ్వర్యంలో ఎస్సై లెనిన్ తమ సిబ్బందితో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రశాంతమైన వాతావరణం కల్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి, ఆలయ పాలకమండలి సభ్యులు ఏర్పాట్లు చేశారు. మాజీ చైర్మన్లు ప్రకాష్‌గుప్త, జంగయ్యగుప్త, నాయకులు నాగోజీ, కృష్ణగౌడ్, రవీందర్, శ్రీనివాసులు, ప్రవీణ్‌రెడ్డి, హనుమంతు, కొండగిరి, వెంకటేశ్వర్లు, బొందయ్య అర్చకులు మహేష్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, శ్రీనివాసశర్మ, ఆలయ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, వరలక్ష్మీ, శ్రీశైలం, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 3 : ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై రామ్‌జీ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని గుడిపల్లి గ్రామానికి చెందిన మధురాజా మల్లేష్(45) గతనెల 31న పొలం వద్దకు వెళ్లి శనివారం బావిలో శవమై తేలాడు. ఈ ఘటనపై భార్య శశికళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి ముగ్గురు కుమార్తెలు న్నారు.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

జడ్చర్ల, ఫిబ్రవరి 3 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలోని బురెడ్డిపల్లి శివారులో జడ్చర్ల పట్టణం ఇందిరానగర్ కాలనీ ప్రాంతానికి చెందిన లింగమ్మ(60) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. జడ్చర్ల ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. బురెడ్డిపల్లి శివారులోని సీఎం కాలనీ సమీపంలోని వాటర్‌ట్యాంక్ వద్ద ఉరి వేసుకుని ఓ మహిళ మృతి చెందిందన్న సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లినట్లు తెలిపారు. వాటర్‌ట్యాంక్ పైకి ఎక్కేందుకు నిర్మించిన మెట్లకు ఏర్పాటు చేసిన పట్టీకి చీరతో ఉరి వేసుకుని ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడినట్లుగా ఉందని తెలిపారు. ఆరా తీయగా ఇందిరానగర్‌కాలనీకి చెందిన లింగమ్మగా గుర్తించినట్లు తెలిపారు. లింగమ్మకు కల్లు తాగే అలవాటు ఉందని, ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన కారణాలు తెలియరాలేదని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జడ్చర్ల ఏరియా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

బైకు ఢీకొని మహిళ మృతి

ఉప్పునుంతల, ఫిబ్రవరి 3 : బైకు ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల కేంద్ర సమీపంలోని కస్తూర్బా బాలికల పాఠశాల వద్ద చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంధం వెంకటమ్మ(60) శుక్రవారం సాయంత్రం వ్యవసాయ పొలం నుంచి ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా రంగంపేట గ్రామానికి చెందిన గడ్డమీది మహేష్ తన తల్లితో కలిసి బైకుపై వస్తూ వెంకటమ్మను వెనుక నుంచి ఢీకొన్నాడు. ప్రమాదంలో వెంకటమ్మ తలకు బలమైన గాయాలు కావడంతో అచ్చంపేటకు ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు యెన్నం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతురాలి కుమారుడు వెంకట్రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు మృతురాలికి భర్త చంద్రయ్యతో పాటు, కుమారుడు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత..

నవాబ్‌పేట, ఫిబ్రవరి 3 : పడుకున్న చోట తన కూతురు మృతి చెందడంపై అనుమానం వ్యక్తం చేస్తు ఓ తండ్రి నవాబ్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్‌చార్జి ఎస్సై సురేందర్‌బాబు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన గోవు శాంతయ్య తన కూతురిని మండలంలోని తంగెడుపల్లి గ్రామానికి చెంది బాలయ్య అనే వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించాడు. కొంతకాలంగా బాలయ్య తన కూతురు బాలమ్మను కాదని మరో అమ్మాయితో ఉంటు ఇంటికి రాకుండా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఈనెల 2న బాలమ్మ తన ఇంట్లో పడుకున్న చోట చనిపోయిందని, ఆమె మృతికి తన అల్లుడు బాలయ్య కారణమంటు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శాంతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై తెలిపారు.

వృద్ధుడి మృతిపై కేసు నమోదు

నవాబ్‌పేట, ఫిబ్రవరి 3 : పడుకున్న చోట ఓ వృద్ధుడు మృతి చెందడంపై అనుమానం వ్యక్తం చేస్తు ఆయన కుమారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహబూబ్‌నగర్ రూరల్ సీఐ గాంధీనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నవాబ్‌పేట మండలంలోని కూచూర్ గ్రామానికి చెందిన బొంకూరి నారాయణ(80) కొంతకాలంగా తన కుమారుల వద్ద కాకుండా ఓ చిన్న రూంలో నివాసం ఉంటున్నాడు. ఈనెల ఒకటో తేదీన ప్రభుత్వ పింఛన్ అందుకున్న నారాయణ రెండురోజులుగా తలుపు తీయకుండా ఇంట్లోనే ఉన్నాడు. అనుమానం వచ్చిన ఇరుగుపొరుగు వారు శనివారం తలుపు తీసి చూడగా నారాయణ మృతిచెంది, దుర్వాసన వచ్చింది. నారాయణకు కల్లు తాగే అలవాటు ఉందని, ఆయన మరణంపై అనుమానం ఉందంటూ కుమారుడు శంకరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

అలంపూర్ చౌరస్తా/మద్దూర్, ఫిబ్రవరి 3 : జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండలం ర్యాలంపాడు గ్రామ శివారులో రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. శనివారం ర్యాలంపాడు గ్రామ శివారులో కానిస్టేబుల్స్ అశోక్‌కుమార్, పరుశరాముడులు గస్తీ నిర్వహిస్తుండగా రెండు ట్రాక్టర్లలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నారు. సదరు వాహనాలను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా, నారాయణపేట జిల్లా మద్దూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దాపూర్ గ్రామ సమీపంలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం సూరారం గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి, కోయిలకొండ వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా పెద్దాపూర్ గ్రామ సమీపంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. వాహన యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

దళితుడిపై దాడికి పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేయాలి

- కుల నిర్మూలన సమితి డిమాండ్
- మద్దిగట్ల గ్రామాన్ని సందర్శించిన సమితి నాయకులు




దాడిలో గాయపడిన రాములును పరామర్శిస్తున్న నాయకులు

భూత్పూర్, ఫిబ్రవరి 3 : దళితునిపై దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గురుమిళ రాజు, సావిత్రిబాయి పూలే మహిళా సంఘం నాయకురాలు గన్నవరపు సరోజ తదితరులు డిమాండ్ చేశారు. శనివారం వారు పాత్రికేయులతో మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం మద్దిగట్ల గ్రామానికి చెందిన మల్లారెడ్డి గ్రామంలోని దళిత వాడల్లో పశువుల పాకను పెట్టి పాల వ్యాపారం చేస్తున్నాడు. పశువుల పాక నుంచి వెలువడే మూత్రం, పేడ వంటివి అదే కాలనీలో ఒక బావిలో వదులుతున్నాడు. బావి నుంచి దుర్గంధం ఏర్పడి తాము తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నామని దళిత కాలనీకి చెందిన గడ్డమీది రాములు, మల్లారెడ్డిని కోరాడు. పశువుల పాకను తొలగించాలని కోరిన రాములుపై మల్లారెడ్డికి పనిమనుషులు కర్రలతో దాడి చేసి గాయపర్చారు. విషయాన్ని తెలుసుకున్న కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి నాయకులు శనివారం మద్దిగట్ల గ్రామాన్ని సందర్శించి, దాడిలో గాయాలపాలైన గడ్డమీది రాములును పరామర్శించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి రాములుపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని కోరారు. అదేవిధంగా మల్లారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చక్రవర్తి, గోవిందు, సైదమ్మ, ఎర్రమోహన్, కృష్ణ, తదితరులున్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

- విద్యార్థులను అభినందించిన హెచ్‌ఎం



రగ్బీ క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

భూత్పూర్, ఫిబ్రవరి 3 : మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి రగ్బీ క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఆనందమ్మ, ఉపాధ్యాయురాలు రేవతి శనివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో రగ్బీ క్రీడా పోటీలకు ఎంపికైన ఎనిమిదవ తరగతి చదువుతున్న కల్పన, తొమ్మిదో తరగతి చదువుతున్న రవితేజను అభినందించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆదివారం నుంచి జరిగే రాష్ట్ర స్థాయి రగ్బీ క్రీడా పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని హెచ్‌ఎం ఆనందమ్మ తెలిపారు.

మహిళ మృతిపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం, ఫిబ్రవరి 3 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో కేతావత్ రాణి(38) అపస్మారక స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై రామ్‌జీ తెలిపారు. లింగాల మండలానికి చెందిన కేతావత్ రాణి, ఆమె భర్త దేవేందర్ కొల్లాపూర్ చౌరస్తాలో నివాసం ఉంటున్నారు. బయటకు వెళ్లిన రాణి రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తమ్ముడు మూడావత్ శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం పట్టివేత

రాజాపూర్, ఫిబ్రవరి 3 : మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని ఖానాపూర్, పలుగుతండాల్లో బెల్ట్ షాపులపై పోలీసులు దాడులు చేశారు. పలుగుతండాల్లో ఫూల్‌సింగ్ కిరాణంలో నాలుగు బీరు బాటిళ్లు, పది బాటిళ్ల బ్రీజర్, ఖానాపూర్ గ్రామంలోని నరేందర్ కిరాణంలో ఎనిమిది బీరు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ కృష్ణారెడ్డి తెలిపారు. రాజాపూర్ వైన్స్‌షాపు నుంచి తీసుకువచ్చి గ్రామాల్లో అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బెల్ట్ షాపులపై దాడులు నిర్వహి స్తామని, గ్రామాల్లో అక్రమంగా మద్యం దొరికితే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

దొంగతనం కేసులో వ్యక్తి అరెస్టు

ఆత్మకూరు, ఫిబ్రవరి 3 : గత నెల 23న వనపర్తి జిల్లా ఆత్మకూర్ అయ్యప్ప కాలనీలో బిల్లకంటి జనార్ధన్ ఇంట్లో దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆత్మకూరు ఎస్సై నరేందర్ తెలిపారు. గత నెల 23వ తేదీన తాళం వేసి ఉన్న జనార్ధన్ ఇంట్లో అంతర్రాష్ట్ర దొంగ అయిన షేక్ ఖాజాపీర్ చొరబడి రూ.60 వేల నగదును అపహరించాడు. ఏపీకి చెందిన ఖాజాపీర్ శనివారం ఉదయం ఆత్మకూరు బస్టాండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకొని విచారించగా గతనెలలో చేసిన దొంగతనం గురించి వెల్లడించినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడి నుంచి రూ.రెండు వేల నగదును స్వాధీనం చేసుకుని ఆత్మకూరు జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు చెప్పారు. ఖాజాపీర్‌పై అనంతపురం జిల్లాలో, అలాగే కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో దొంగతనం కేసులు నమోదు అయ్యాయని ఎస్సై తెలిపారు.

విద్యార్థిని పట్ల యువకుడి అసభ్య ప్రవర్తన

- కేసు నమోదు

జడ్చర్ల, ఫిబ్రవరి 3 : స్కూల్ నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని ఓ గ్రామంలో విద్యార్థిని వెంట పడిన ఓ యువకుడు అసభ్యంగా ప్రవర్తించాడు. విద్యార్థినీ ఫిర్యాదు మేరకు యువకుడిపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్‌తో పాటు, ఫోక్సో కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

12న మహబూబ్‌నగర్ పురపాలిక చైర్మన్ ఎన్నిక

- ఈసీ ఆదేశాల మేరకు నోటిఫికేషన్ జారీ చేసిన కలెక్టర్
- మూడురోజుల ముందు సభ్యులకు నోటీసులు
- మళ్లీ క్యాంపు రాజకీయం షురూ
- హాజరైన వారిలో 50 శాతం ప్లస్ ఒకరు మద్దతివ్వాలి



మహబూబ్‌నగర్ మునిసిపల్ కార్యాలయం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 3 : మహబూబ్‌నగర్ మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు ముహూర్తం ఖరారైంది. గత నెల 27న పాలమూరు పురపాలిక చైర్మన్, వైస్ చైర్మన్‌లపై పెట్టిన అవిశ్వాసం నెగ్గిన సంగతి తెలిసిందే. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కలెక్టర్ జి.రవినాయక్ ఈనెల 12న చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు సంబంధించి శనివారం సాయంత్రం నోటిఫికేషన్ జారీ చేశారు. పురపాలిక అధికారులకు ఉత్తర్వులు రావడంతో అధికారులు చైర్మన్ ఎన్నికకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. 12న ఉదయం 11 గంటలకు కలెక్టర్ ఆధ్వర్యంలో పురపాలిక సమావేశ మందిరంలో ఎన్నికలు నిర్వహించనున్నారు. 49 మంది సభ్యులున్న కౌన్సిల్‌లో.. ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఓటును వినియోగించుకోనున్నారు. 50 మంది సభ్యుల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకోవాలంటే 26 మంది సభ్యుల మద్దతు అవసరం. అయితే ఆ రోజు హాజరైన సభ్యుల్లో 50 శాతం ప్లస్ ఒకరు ఓటు వేస్తే సరిపోతుంది. కాగా గత నెల 27న నిర్వహించిన సమావేశంలో చైర్మన్ కోరమోని నర్సింహులు, వైస్ చైర్మన్ తాటిగణేష్‌లపై అవిశ్వాసానికి అనుకూలంగా 36 మంది సభ్యులు మద్దతు తెలిపారు. దాంతో చైర్మన్, వైస్ చైర్మన్‌లు మాజీలు కావాల్సి వచ్చింది. తాజాగా చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడంతో మళ్లీ కౌన్సిలర్‌ల క్యాంప్ రాజకీయాలు మొదలు కానున్నాయి. ఎన్నికకు మరో ఎనిమిది రోజుల గడువు ఉండటంతో కౌన్సిలర్‌ను కాపాడుకునేందుకు పార్టీలు ప్రయత్నాలు మొదలుపెట్టాయి. కాంగ్రెస్ పార్టీ చైర్మన్‌గా ఆనంద్‌కుమార్‌గౌడ్‌ను బరిలో నిలుపగా, బీఆర్ఎస్ నుంచి కోరమోని వనజ బరిలో ఉండే అవకాశం ఉంది. ఇరు పార్టీలు కౌన్సిలర్‌లను మళ్లీ శిబిరాలకు తరలించే అవకాశం ఉండటంతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికపై ఉత్కంఠ నెలకొంది. అవిశ్వాసానికి మద్దతిచ్చిన వారి మద్దతు అధికార పార్టీ నిలుపుకుంటుందా? లేదంటే బీఆర్ఎస్ మళ్లీ చైర్మన్ పీఠాన్ని కాపాడుకుంటుందా? అన్నది 12న తేలనుంది. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మొదటి నుంచి అవిశ్వాసాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని సభ్యుల మద్దతు కూడగట్టడంలో సక్సెస్ అయ్యారు. అదే ఫార్ములాతో చైర్మన్ ఎన్నికలో మెజారిటీ సభ్యుల మద్దతుతో పురపీఠాన్ని తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

అమ్రాబాద్ అడవుల్లో మహారాష్ట్ర ట్రైనీ అధికారుల క్షేత్ర పర్యటన

మన్ననూర్, ఫిబ్రవరి 3 : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతం(ఏటీఆర్)లో మహారాష్ట్రకు చెందిన 35మంది ట్రైనీ రేంజ్ అధికారులకు దూలపల్లి అటవీ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం ఐదో రోజు శిక్షణ తరగతులు కొనసాగాయి. మన్ననూరు రేంజ్‌లోని సలేశ్వర జలపాతాలను సందర్శించారు. ఈ ప్రాంతం ముఖ్యంగా పులులు సంచరించే ప్రాంతమని, ఎత్తయిన కొండ నుంచి జలపాతం నిర్విరామంగా జాలువారుతూ ఉంటుందని, నీరు ఉండే ప్రాంతం కావడంతో వన్యప్రాణులు ఇక్కడే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏటీఆర్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఏడాదికి ఒక్కసారి మాత్రమే చైత్రపౌర్ణమి సందర్భంగా చెంచుల ఆలయం లింగమయ్య దర్శనానికి సలేశ్వర సందర్శనకు మూడురోజులు అటవీశాఖ అనుమతినిస్తుందన్నారు. ఈ యాత్రలో అడవికి వచ్చే వారిని ఎలాంటి ప్లాస్టిక్ వస్తువులను తీసుకురాకుండా నిషేధిస్తారని అవగాహన కల్పించారు. అనంతరం దోమలపెంట రేంజ్‌లోని ఆక్టోపస్ వ్యూ పాయింట్, కృష్ణానదిలో బోటు ప్రయాణం చేసి శ్రీశైలానికి వెళ్లారు. కార్యక్రమంలో బయాలజిస్టు మహేందర్, దోమలపెంట రేంజ్ అధికారి గురుప్రసాద్, మన్ననూరు రేంజర్ రవికుమార్ పాల్గొన్నారు.



మన్ననూరు రేంజ్‌లో శిక్షణ రేంజ్ అధికారులు

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

- గ్రామాలలో పర్యటించిన అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్



కొత్తపల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

నవాబ్‌పేట, ఫిబ్రవరి 3 : మండలంలోని కొత్తపల్లి, కొత్తపల్లితండా గ్రామ పంచాయతీలను అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఆర్డీవో యాదయ్య సందర్శించారు. ఆయా గ్రామాల్లో ఎంపీడీవో శ్రీనివాస్‌తో కలిసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిధుల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు, నిధుల ఖర్చును అడిగి తెలుసుకున్నారు. పంచాయతీలో ప్రతీ రికార్డు సక్రమంగా ఉండాలని కార్యదర్శులను ఆదేశించారు. వేసవిలో ప్రజలకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీవో భద్రు నాయక్, కార్యదర్శులు ఉన్నారు.

జీవో 60 ప్రకారం వేతనాలు అమలు చేయాలి

- జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు నోటీసు అందజేసిన కార్మికులు



సూపరింటెండెంట్‌కు నోటీసు అందజేస్తున్న కార్మికులు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), ఫిబ్రవరి 3 : ప్రభుత్వం విడుదల చేసిన జీవో 60 ప్రకారం వేతనాలు ఇవ్వకపోతే సమ్మె తప్పదని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం డిమాండ్ నోటీసును ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, అలా కాకుండా సాయి సెక్యూరిటీ సర్వీసెస్ ఏజెన్సీ కాం ట్రాక్టరు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అంతేకాకుండా కార్మికులకు ఇచ్చే వేతనాలలో కోతలు విధిస్తూ శ్రమదోపిడీ చేస్తున్నారన్నారు. ఆ కాంట్రాక్టరు చేసే దోపిడీపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు చెన్నయ్య, నర్సింహ, మొగులన్న, బాలకోటి, దేవానంద్, రామకృష్ణ పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

మిడ్జిల్, ఫిబ్రవరి 3 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతాంగ, కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి తెలుగు సత్తయ్య అన్నారు. శనివారం మండలకేంద్రంలోని ఈనెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌కు సంబంధించిన సమ్మె నోటీసులను తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీవో సాయిలక్ష్మీతో పాటు పలువురు అధికారులకు సీఐటీయూ ఆధ్వర్యంలో సత్తయ్య వేర్వేరుగా అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సీనియర్ నాయకులు భాగీ కృష్ణయ్య, నాయకులు సారిక ఈమెలీయా, మాధవి, చెన్నమ్మ, విజయలక్ష్మి, సుజాత, బాలస్వామి, యాదయ్య, వెంకటయ్య, సరిత, దేవమ్మ ఉన్నారు.

బాలికపై లైంగిక దాడి

- చికిత్స కోసం జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలింపు

జడ్చర్ల, ఫిబ్రవరి 3 : జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలో ఓ బాలికపై ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. విశ్వసనీయంగా తెలిసిన వివరాల మేరకు... మునిసిపాలిటీలోని ఓ ప్రాంతంలో నివసిస్తున్న ఓ కుటుంబంలోని బాలికకు ఓ యువకుడు మాయమాటలు చెప్పి, తన ద్విచక్రవాహనంపై మరో ప్రాంతానికి తీసుకెళ్లాడు. శీతలపానీయం ఇప్పిస్తానంటూ చెప్పి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇదే సందర్భంలో ఇబ్బందిగా వస్తున్న సదరు బాలిక పరిస్థితిని గమనించిన కొందరు ఆ యువకుడికి దేహశుద్ధి చేశారు. బాలికలను వైద్యం కోసం జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి, అక్కడినుంచి జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సదరు యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

'బీసీల ఐక్యతతోనే పాలమూరు ఎంపీ సీటు సాధ్యం'

పాలమూరు, ఫిబ్రవరి 3 : మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో బీసీలు ఐక్యతతో ఉండటంతోనే బీసీలకు ఈ స్థానం కేటాయిస్తారని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలువురు బీసీ నేతలు ఐక్యత కనబరిచారు. బీసీలు ఐక్యంగా పని చేయటంతోనే అన్ని రాజకీయ పార్టీలు బీసీ అభ్యర్థులను ప్రకటిస్తాయన్నారు. బీసీ కుల సంఘాలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలతో కలిసి ఐకమత్యంతో ముందుకెళ్లి బీసీ అభ్యర్థిని గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తారని తెలిపారు. అఖిలభారత రజక రిజర్వేషన్ సంఘ్ అధ్యక్షుడు నడిమింటి శ్రీనివాస్ రజక మాట్లాడుతూ పాలమూరు పార్లమెంట్ స్థానాన్ని బీసీలకే కేటాయించాలని కోరుతూ బీసీలంతా మూకుమ్మడిగా ఏడు నియోజకవర్గాల్లో మండల కమిటీల్లో తీర్మానం చేయాలన్నారు. సమావేశంలో బీసీ సమాజ్ కో-కన్వీనర్లు సవారి సత్యం, ఆర్.సత్యం, బి.శేఖర్, శివన్న, జె.నాగన్న, ఏ.భీమన్న, రాజు, ఏ.బాలచందర్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : ఎస్పీ హర్షవర్ధన్



ఎస్పీని సన్మానిస్తున్న చైర్మన్ తదితరులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 3 : క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య విద్యాసంస్థల అధ్వర్యంలో పాఠశాల వార్షికోత్సవం సదర్భంగా క్రీడోత్సవాన్ని నిర్వహించారు . ఈ కార్యక్రమాన్ని ఎస్పీ హర్షవర్ధన్, డీఈవో రవీందర్‌లు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు విదార్థులు విద్యతో పాటు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జయశ్రీ, చైర్మన్ శ్రీధర్, ఏజీఎం భాస్కర్‌రెడ్డి, ఇన్‌చార్జీ డీన్‌లు , ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ ఎంపీ టికెట్ కోసం దరఖాస్తులు

- దరఖాస్తు చేసిన ప్రముఖ న్యాయవాది ఎన్‌పీ వెంకటేష్



ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు ఎన్‌పీ వెంకటేశ్

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 3 : మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ టికెట్ కోసం బీసీ నాయకుడు, ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ప్రముఖ న్యాయవాది ఎన్‌పీ వెంకటేశ్ దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి దరఖాస్తు చేసుకొని ఎన్నికల ప్రచారం చేసుకుంటుండగా బీసీవర్గాలకు చెందిన నాయ కులు కూడా టికెట్ కోసం పోటీపడుతున్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముది రాజ్ కూడా టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఎవరికి వారు తమ ప్రయత్నాలు సాగిస్తున్నారు. అసెంబ్లీ టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నాలు చేసిన ఎన్‌పీ వెంకటేశ్ ఎంపీ టికెట్‌కు దరఖాస్తు చేయడం చర్చనీయాంశంగా మారింది. మహబూబ్ నగర్ పార్లమెంట్ పరిధిలో 54 శాతం బీసీ ఓటర్లు ఉన్నారని, ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన తమ వర్గం వారు పార్లమెంట్ పరిధిలో 3 లక్షల మంది ఓటర్లు ఉన్నారని దరఖాస్తులో పేర్కొన్నారు. 33 ఏళ్లపాటు న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నానని, మహబూబ్‌నగర్ స్థానికుడినైన తనకు అవకాశం కల్పించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికలో మహబూబ్‌నగర్ అసెంబ్లీ టికెట్ ఆశించానని, చివరి క్షణంలో యెన్నెం శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ ఖరారు చేయగా హైకమాండ్ ఆదేశాల మేరకు ఆయన విజయం కోసం పూర్తిస్థాయిలో కృషిచేసినట్లు పేర్కొన్నారు.

గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించాం

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క వీసీలో కలెక్టర్ రవి నాయక్



గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ జి. రవినాయక్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), ఫిబ్రవరి 3 : గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించి, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తగు సూచనలు ఇచ్చామని కలెక్టర్ జి. రవినాయక్ వివరించారు. సర్పంచుల పదవీ కాలం పూర్తయినందున వారి స్థానంలో గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. ప్రత్యేక అధికారులు గ్రామ పంచాయతీలలో సమస్యలు తలెత్తకుండా పూర్తి బాధ్యతతో పనిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డి. అనసూయ (సీతక్క) కోరారు. శనివారం ఆమె ములుగు జిల్లా నుంచి రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ హన్మంతరావుతో కలిసి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి వీసీలో కలెక్టర్ జి. రవినాయక్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు నియమించబడిన ప్రత్యేక అధికారులకు ఈ సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా చూస్తామని, ప్రస్తుతం ఉన్న సౌకర్యాలపై ఇంటింటి సర్వేతో పాటు, ఈ నెల 7 నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుధ్యం డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. ఉపాధి పథకం కింద రూ. 14 కోట్ల విలువచేసే 285 పనులకు మంజూరు ఇచ్చామని, వాటి గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జడ్పీ సీఈవో జ్యోతి, డీపీవో వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఎస్‌ఈ వెంకటరమణ, డీఆర్డీవో యాదయ్య, పీఆర్ ఈఈ నరేందర్, మిషన్ భగీరథ ఇంజనీరింగ్, పంచాయతీరాజ్ అధికారులు వీసీకి హాజరయ్యారు.

ప్రత్యేక అధికారులు తక్షణమే రిపోర్ట్ చేయాలి

గ్రామపంచాయతీలకు నియమించబడిన అధికారులందరు తక్షణమే రిపోర్ట్ చేయాలని కలెక్టర్ జి. రవినాయక్ ఆదేశించారు. శనివారం రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రెటరి సందీప్ కుమార్ సుల్తానియాలు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ తన కార్యాలయం నుంచి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రత్యేక అధికారులందరు వారికి కేటాయించిన గ్రామాలకు వెళ్లి, పారిశుధ్యం, తాగునీరు, మౌలిక సదుపాయాలను విశ్లేషణ చేయాలని, గ్రామపంచాయతీ చట్టాన్ని పూర్తిగా అవగాహన చేసుకోవాలని కోరారు. సోమవారం ప్రత్యేక అధికారులందరికీ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా పంచాయతీ అధికారుల వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈఓ జ్యోతి, మిషన్ భగీరథ ఎస్‌ఈ వెంకటరమణ, డీఆర్డీవో యాదయ్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులు, ఈ వీడియోకాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.



హైకోర్టు జడ్జి ఎన్. వి. శ్రవణ్ కుమార్‌తో సమావేశమైన కలెక్టర్ రవి నాయక్, ఎస్పీ హర్షవర్ధన్

హైకోర్టు జడ్జి ఎన్.వి. శ్రవణ్ కుమార్ ను కలిసిన జిల్లా కలెక్టర్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), ఫిబ్రవరి 3 : జ్యుడీషియల్ అధికారుల సమావేశంలో పాల్గొనే నిమిత్తం జిల్లాకు వచ్చిన రాష్ట్ర హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి ఎన్. వి. శ్రవణ్ కుమార్‌ను కలెక్టర్ జి. రవి నాయక్, ఎస్పీ హర్షవర్ధన్, జిల్లా జడ్జి పాపిరెడ్డిలు శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రోడ్లు, భవనాల అతిథి గృహంలో మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. జిల్లా కోర్టు జడ్జిలు హైకోర్టు జడ్జికి ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు, డీఎస్పీ మహేశ్, రెవెన్యూ అధికారులు, కోర్టు అధికారులు పాల్గొన్నారు.



జడ్చర్లలో జన్మదినం సందర్భంగా కేకు కట్ చేస్తున్న మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి, చిత్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



రక్తదానం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఘనంగా మాజీ మంత్రి లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు

● రక్తదానం చేసిన 1023 మంది నాయకులు, కార్యకర్తలు

జడ్చర్ల, ఫిబ్రవరి 3 : బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలను శనివారం జడ్చర్ల పట్టణంలోని చంద్రాగార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. జాతీయరహదారి జడ్చర్ల మునిసిపాలిటీలోని ఎంబీ మెడికల్ సెంటర్ నుంచి చంద్రాగార్డెన్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో భాగంగా జడ్చర్ల క్రాస్‌రోడ్డు వద్ద, కావేరమ్మపేట వెళ్లే మలుపు వద్ద, ఇందిరానగర్ కాలనీ, సిగ్నల్‌గడ్డ ప్రాంతాలలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన కార్యక్రమాల వద్ద డాక్టర్ సి.లక్ష్మారెడ్డి కేకులను కట్ చేశారు. పట్టణంలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. డాక్టర్ సి.లక్ష్మారెడ్డి జన్మదినం పురస్కరించుకొని క్రాస్‌రోడ్డు వద్ద, సిగ్నల్‌గడ్డ ప్రాంతాలలో భారీ గజమాలలతో సత్కరించారు. రక్తదాన శిబిరంలో 1023 మంది రక్తదానం చేశారు. వీరికి ప్రశంసాపత్రాలను డాక్టర్ సి.లక్ష్మారెడ్డి అందజేశారు. డాక్టర్ సి.లక్ష్మారెడ్డితో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి తనయుడు స్వరణ్, డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య, మునిసిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మీతో పాటు కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు, మాజీ డైరెక్టర్‌లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కేకును కట్ చేయించారు. మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్, సాట్స్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, అడ్వకేట్ జంగయ్యతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, సత్కరించారు.

● రాజాపూర్ : మండల కేంద్రంలో మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేక్‌ను లక్ష్మారెడ్డి పాల్గొని కట్ చేశారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆయా గ్రామాల ముఖ్యనాయకులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● నవాబ్‌పేట : జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సి. లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షుడు మాడెమోని నర్సింహులు, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ అనంతయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్, ప్రతాప్, మధుసూదన్‌రెడ్డి, గండు చెన్నయ్య, ముంత యాదయ్య, తాహెర్, కృష్ణగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రఘు, గవిండ్ల శంకర్, భోజయ్యచారి, అబ్దుల్లా, నవనీత్‌రావు, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

మిడ్జిల్ : మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాండు, ఎంపీపీ బరిగెల సుదర్శన్, జడ్పీటీసీ శశిరేఖబాలు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు జంగారెడ్డిల ఆధ్వర్యంలో కేక్‌ను కట్‌చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, జగన్ గౌడ్, నారాయణ్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, నిరంజన్, భాస్కర్, బంగారు, సత్యంగుప్తా, ఆచారి, వెంకట్‌రెడ్డి, సుకుమార్, శ్రీనివాసులు, భీంరాజ్, జగన్‌గౌడ్, శేఖర్, రవింద్ర, రాము, వెంకటయ్య మల్లేష్‌లతో పాటు తదితరులున్నారు.

● బాలానగర్ : మండల కేంద్రంలో డాక్టర్ సి. లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శనివారం కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. నాయకులు వాల్యానాయక్, వెంకటాచారి, శ్రీనివాసరావు, గోపి నాయక్, రాములునాయక్, శ్రీనివాసచారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పల్లెకు పోదాం'ను విజయవంతం చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీ. శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పీ. శ్రీనివాస్ రెడ్డి

నవాబ్‌పేట, ఫిబ్రవరి 3 : ప్రధాన మంత్రి మోదీ నాయకత్వంలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీ. శ్రీనివాస్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల కోసం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యర్శి ప్రతాప్ రెడ్డి, మండల అధ్యక్షుడు గవిండ్ల గవిండ్ల రాజు, బుడ్డ, తిరుపతిరెడ్డి, శ్రీకాంత్, మండల నాయకులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంఘిక శాస్త్రంపై పట్టు సాధించాలి

- మహబూబ్‌నగర్ డీఈవో ఎ.రవీందర్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వేదిక నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 3 : విద్యార్థులు అన్ని సబ్జెక్టుల మంచి పట్టు సాధిస్తూనే సాంఘిక శాస్త్రంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని డీఈవో ఎ.రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుల వేదిక ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్థాయి సాంఘికశాస్త్ర టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ టెస్టుకు జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల నుంచి 400 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి డీఈవో రవీందర్ ముఖ్య అతిథిగా హాజరై టాలెంట్ టెస్టు ప్రశ్నపత్రాన్ని వేదిక అధ్యక్షుడు దండు చెన్నప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, ఏఎంవో దుంకుడు శ్రీనివాస్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం విజేతలకు నగదు పురస్కారాలు అందజేశారు. తెలుగు మీడియంలో జడ్పీహెచ్ఎస్ వింజమురు పాఠశాల విద్యార్థి భీమేశ్వరి ప్రథమ బహుమతి రూ.3000, గండీడ్ జిల్లా పరిషత్ (బాలికల) ఉన్నత పాఠశాల ద్వితీయ బహుమతి మహేఖ్‌బేగం, జడ్పీహెచ్ఎస్ చంద్రాస్‌పల్లి పీకే శివకుమార్‌కు రూ.2000లు, మూడో బహుమతి రంగారెడ్డిగూడ జడ్పీహెచ్ఎస్ జగన్‌కు రూ. 1000 అందజేశారు. ఇంగ్లిష్ మీడియంలో జడ్పీహెచ్ఎస్ బాలుర వెన్నాచేడ్ విద్యారి అనూషకు మొదటి బహుమతి రూ.3000, కేజీబీవీ అర్బన్ పూజిత రెండవ బహుమతి రూ.2000, పెద్దరేవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన షణ్ముఖప్రియలు మూడో బహుమతి సాధించారు. ఈ విద్యార్థులకు ఈ నెల 10న రాష్ట్ర స్థాయిలో టాలెంట్ టెస్టు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రముఖ సైకాల జిస్టు లక్ష్మణ్ సూచనలు ఇచ్చారు. వేదిక నాయకులు కృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, నాగరాజు, విష్ణు, పాండురంగం, భాస్కర్, బురాన్ వెంకటయ్య, శ్రీనివాసులు, బాలవర్ధన్, శివకుమార్, రాజు, జుర్రు నారాయణ, వేణుగోపాల్ స్వప్న, లత, శ్రీలేఖ పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టులో వింజమూర్ పాఠశాల విద్యార్థి ప్రతిభ



నిర్వాహకులచే బహుమతి అందుకుంటున్న విద్యార్థి భీమేశ్వరి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 3 : జిల్లా కేంద్రంలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయవేదిక ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి టాలెంట్ టెస్టులో వింజమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన భీమేశ్వరి ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి మొదటి బహుమతి సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేందర్, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు.

అద్వానీకి భారతరత్నపై హర్షం

మహబూబ్ నగర్ (క్లాక్ టవర్), ఫిబ్రవరి 3 : మాజీ ఉపప్రధాని, భారతీయ జనతా పార్టీ జాతీయ సీనియర్ నాయకులు లాల్‌కృష్ణ అద్వానీని భారతరత్నతో సత్కరించడం చరిత్ర పుటలలో నిలిచిపోతుందని బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతకుమార్ ఆనందం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ అద్వాని భారత రాజకీయాలలో తనకంటూ ఒక ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకున్న నాయకుడని అభిప్రాయపడ్డారు. అద్వాని పేరు వినగానే దేశ ప్రజలకు అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి చేపట్టిన రథయాత్ర గుర్తుకు వస్తుందని తెలిపారు. ఈ యాత్ర భారత రాజకీయ పాలన వ్యవస్థలో కీలక మలుపును తీసుకవచ్చిందని, జాతీయ నాయకత్వంలో, దేశ ఉపప్రధానిగా, కేంద్ర హోం మంత్రిగా విధులు నిర్వహిస్తు, ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. 1980లో ఏర్పడిన భారతీయ జనతాపార్టీని నేడు తిరుగులేని స్థాయిలో ఉండడం కోసం ఎల్‌కె అద్వాని ఎంతో శ్రమించారని ఆయన కొనియాడారు. మెజార్టీ భారతీయుల మనోభావాలకు ప్రతీకగా నిలిచి, ఆయన ధృడ చిత్తంతో చేపట్టిన కార్యక్రమాలు దేశ రాజకీయాలను ఎంతో ప్రభావితం చేశాయన్నారు. సరైన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఎల్‌కే అద్వానిని భారతరత్నతో సత్కరించడం దేశప్రజలకు ఎంతో గర్వకారణమని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్యశ్రీ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), ఫిబ్రవరి 3 : జిల్లాలోని ఆరోగ్యశ్రీ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా కనికె గిరిప్రసాద్, అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రదీప్‌కుమార్, కార్యదర్శిగా మురళీమోహన్, ఉపాధ్యక్షురాలిగా సరితారాణి, కోశాధికారిగా సంజీవ, అరుణ ఎన్నికయ్యారు. తనపై నమ్మకంతో యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని, ఉద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తానని తెలిపారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అపెక్స్‌లో ఎడ్యుకేషనల్ ఎగ్జిబిషన్



ప్రదర్శలను తిలకిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 3 : జిల్లా కేంద్రంలోని అపెక్స్ పాఠశాలలో శనివారం విద్యార్థులు ఎడ్యుకేషన్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్ పలువురిని ఆకట్టుకుంది విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. విద్యార్థుల తల్లిడండ్రులు, పలువురు సందర్శించారు. కార్యక్రమంలో మొత్తం 245మంది విద్యార్థుల చేత 148 మంది ఎగ్జిబిట్స్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శివజ్యోతి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చౌడూర్‌ను సందర్శించిన తహసీల్దార్

నవాబ్‌పేట, ఫిబ్రవరి 3 : మండలంలోని చౌడూర్ గ్రామాన్ని శనివారం తహసీల్దార్ మల్లికార్జున్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సమీపంలో క్రషర్ పనులకోసం తహసీల్దార్ కార్యాలయం జారీ చేసిన ఎన్‌ఓసీపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పలువురు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు వాస్తవాలు తెలుసుకోకుండా క్రషర్ యజమానులకు ఎన్‌ఓసీ జారీ చేయడం వల్ల క్రషర్ పనులు చేపట్టి పొలం చుట్టూ ప్రాంతాలు దుమ్మూధూళితో నిండిపోతాయన్నారు. తమకు సంబంధం లేకుండానే విద్యుత్ అధికారులు తమ పొలాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నందున వెంటనే నిలిపి వేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ మరోసారి పంచనామా చేసి ఎన్‌వోసీ నిలుపుదల చేస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ గోపీకృష్ణ, మాజీ ఎంపీటీసీ చిన్నయ్య, యూసుఫ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆపరేషన్ స్మైల్ ద్వారా 51 మంది బాలల చేరదీత : ఎస్పీ

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 3 : ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ద్వారా జిల్లాలో 51 మంది బాలలను గుర్తించి వారి తల్లిదండ్రులు, సంరక్షకులకు క్షేమంగా అప్పగించినట్లు ఎస్పీ హర్షవర్ధన్ శనివారం ఒక ప్రకటలో తెలిపారు. జిల్లాలో నెల రోజుల పాటు జిల్లా పోలీసు, బాలల రక్షణ, లేబర్, రెవెన్యూ హెల్త్ మొదలగు డిపార్ట్‌మెంట్‌ల అధికారుల సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా నిరాధరణకు గురై వెట్టిచాకిరీ చేస్తున్న 51మంది బాలలను చేరదీయగా, ఇందులో తెలంగాణకు చెందిన 31 మంది బాలలు, ఇద్దరు బాలికలు ఉన్నారని, ఇతర రాష్ట్రాలకు చెందిన 18 మంది ఉన్నారని వెల్లడించారు. అధికారుల పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా రెస్క్యూటీమ్స్ జిల్లాలోని వివిధ ప్రాంతాలలో వీరిని గుర్తించారని, ఆపరేషన్ స్మైల్ లక్ష్యం చేరేలా అందరూ కలిసి బాగా పనిచేశారని వివరించారు. బాలల రక్షణకోసం నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని ఎస్పీ తెలిపారు. బాలల వికాసానికి, బంగారు భవిష్యత్తుకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని కోరారు. బాలలను విద్య గొప్పదనాన్ని వివరించి వారిని చదువుకునే దిశగా ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఉచిత వసతితో కూడిన విద్యను అందిస్తున్నందున తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పిల్లలకు బంగారు భవిష్యత్తు అందేలా చూడాలన్నారు.

చెకుముకి పోటీలో హన్వాడ విద్యార్థుల ప్రతిభ

హన్వాడ, ఫిబ్రవరి 3 : మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో రాణించి రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపికయ్యారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన ఈ టెస్ట్‌లో విజయం సాధించడం పట్ల ఎంఈవో రాజునాయక్, చెకుముకి మండల కోఆర్డినేటర్లు మల్లేష్, రాఘవేందర్‌లు విద్యార్థులను, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

సీఐ గాంధీ నాయక్‌ను కలిసిన నాయకులు

నవాబ్‌పేట, ఫిబ్రవరి 3 : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం రూరల్ సీఐ గాంధీ నాయక్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలని కోరారు. సీఐని కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు బంగ్ల రవి, రుద్రారం రవి, సాయన్న, చౌడూర్ గోపాల్, షబ్బీర్, అమ్మాపూర్ నర్సింహులు ఉన్నారు.